క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ


వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్ గ్రామంలోని పేద వడ్డేర మహిళలకు సోమవారం మండల వడ్డేర సంఘం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వడ్డేర సంఘం అధ్యక్షుడు యనమల ప్రసాద్ చీరలను పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డేరలు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు ఆలకుంట రాజయ్య, గోపి, మునస్వామి, మునిశేఖర్, సత్యయ్య, ముత్యాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


సాయం అందిస్తున్న సర్పంచ్ చిన్నదొరై

నాగలాపురం: మండలంలోని వెళ్లూరు గ్రామానికి చెందిన ఎం.మౌలివేలు ఆదివారం అనారోగ్యంతో మరణించాడు. వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలు నగదును నాగలాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీఎంకె బాబు, ఎంపీపీ సింధూ శ్యామ్, ఎంపీటీసీ రాజ, నాయకులు హరిబాబు, పళని పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుమన్


ఆలయ ధ్వజస్తంభం వద్ద నటుడు సుమన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ప్రముఖ సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా పసల కృష్ణయ్య జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసల కృష్ణయ్య జన్మదినం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, వెంకటేష్‌నాయుడు, కావలి గోపిగౌడ్, బావులూరు అంకయ్య, మునిరాజా, గుడ్ల హరి, గుడ్ల గోపి, పసల రమణయ్య, నాగరాజు, అంకయ్య, వెంకటేష్, పరశురామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్లను ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీమురళి మాటాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ సంఘం ఎంతగానో పోరాడుతోందని తెలిపారు. దీంతో ఎస్టీయూపై ఉపాధ్యాయులకు నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనరు గుమ్మడిమురళి, మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి సురేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


గాయపడిన శకుంతల

నారాయణవనం: మోటార్ సైకిల్ ఢీకొనడంతో గుడికి వెళ్లి వస్తున్న మహిళ తీవ్ర గాయాల పాలైన సంఘటన మండల కేంద్రమైన నారాయణవనంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నారాయణవనం కీళగరం గ్రామానికి చెందిన శకుంతల(51) సోమవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని ఇంటికి వెళుతోంది. అదే సమయంలో కసిమిట్ట క్రాస్ వద్ద వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన మునస్వామి పుల్లుగా తాగి మోటార్ సైకిల్‌పై ఎదురుగా వస్తున్న శకుంతలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శకుంతలకు కాలు విరిగి, తలకు తీవ్ర గాయమైంది. ఏఎస్‌ఐ జయరాం నాయక్ ఆమెను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఆలయాలకు నూతన శోభ






పిచ్చాటూరు: విశేష అలంకరణలో శ్రీ జలకంఠేశ్వర స్వామి, సిద్ధిరాజుకండ్రిగలో సోమనాథేశ్వర స్వామి, వరదయ్యపాళెం: కల్యాణ వేంకటేశ్వరస్వామి, జ్యోతీశ్వర స్వామి, రామగిరి వాలీశ్వర స్వామి ఆలయంలో అశేష భక్తులు

నారాయణవనం: మండల ప్రజలు ఆంగ్ల సంవత్సరాదిని వేడుకల మధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో సందడి నెలకొంది. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని వేకువజామున 4 గంటలకు తిరుప్పావైతో తెరచి నిత్య, ధనుర్మాస పూజల అనంతరం 5 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలో ఉదయం నుంచే భక్తులు, పర్యాటకులు జలపాతంలో స్నానాలు చేసి కామాక్షాంబిక సమేత కైలాసనాథకోనను దర్శించున్నారు. వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ సమస్యలతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి 11 గంటలకు తేరు ఉత్సవం, ఉయ్యాల సేవను నిర్వహించారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం సొరకాయల స్వామికి భక్తులచే పాలాభిషేకం నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ పరమేష్ నాయక్ సిబ్బందితో ఆలయాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజలు సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కుల, మతాలకు అతీతంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నింటాయి. మండలకేంద్రంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, వినాయక ఆలయాలు, పల్లమాల గ్రామంలోని శ్రీరామక్షేత్రం, పచ్చాలమ్మ, నీర్పాకోట గ్రామంలోని చెంగాలమ్మ దేవత, గాజులపెళ్లూరు శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఇంటి ముందు మహిళలు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపే రంగవల్లులు వేశారు. పల్లమాల గ్రామంలోని ఆలయంలో రంగులు అద్దిన ఉప్పుతో వేసిన పచ్చాలమ్మ దేవత ప్రతిమ ఆకట్టుకుంది. అలాగే చర్చిల్లో కూడా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో సొరకాయల స్వామి

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం పిచ్చాటూరు మండలంలోని ప్రముఖ ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రామగిరి శ్రీ వాలీశ్వరాలయం, సిద్ధిరాజుకండ్రిగలోని శ్రీ సోమనాథేశ్వరాలయం, కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వరాలయం, నీరువాయిలోని శ్రీ నీలకంఠేశ్వరాలయాలు భక్తులు కిటకిటలాడారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి అన్నదానం చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆ మేరకు వరదయ్యపాళెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, త్రయంబకేశ్వరాలయం, పాండూరు సమీపంలోని శ్రీ జ్యోతీశ్వరస్వామి ఆలయం, పెద్ద పాండూరులోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, జ్యోతినగర్ కూడలిలోని శ్రీ అభయ అంజనేయస్వామి ఆలయం, అరుదూరులోని శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. యువత కేక్‌లు కోసి న్యూఇయర్ జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు యువకులు కేరింతలు, డాన్స్‌లతో సందడి చేశారు. అలాగే అర్ధరాత్రి దాటాకా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఊరూరా కేక్‌లు కోసి ఒకరినొకరు శుభాకాంక్షాలు చెప్పుకున్నారు.





బుచ్చినాయుడుకండ్రిగ: ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, కైలాసకోనలో కిక్కిరిసిపోయిన భక్తజనం, జ్యోతీశ్వరాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు, బుచ్చినాయుడుకండ్రిగ : శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు

పిచ్చాటూరు: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేయడానికి రామ భక్తులు సిద్ధమయ్యారు. ఈ నెల 22న అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీ రామమందిరం ప్రారంభం కానుంది. ఆలోపు ప్రతి ఇంటికీ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని రామభక్తులు నిశ్చయించారు. అయోధ్య రాముడి అక్షింతలు పిచ్చాటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ముకుందరాజు వద్దకు గతవారం చేరాయి. వీటిని ఇప్పటికే అన్ని పంచాయతీలకు చేరవేశారు. ఆ అక్షింతలను చిన్న చిన్న కవర్లలో ప్యాక్ చేసి ఈ నెల 15 లోపు ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నట్లు ముకుందరాజు వెల్లడించారు. ప్రతి ఇంటికీ అక్షింతలు, శ్రీరాముడి చిత్రపటంతో పాటు జనవరి 22న అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం సమయంలో ప్రతి ఇంటిలో ఎలాంటి నియమాలు పాటించాలనే అంశాలకు సంబంధించిన కరపత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కీలపూడిలోని శేఖర్ రాజు ఇంటి వద్ద మహిళలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నారు.


పిచ్చాటూరు : అయోధ్య రాముడి అక్షింతలను ప్యాక్ చేస్తున్న మహిళలు

రూ.4.5 కోట్లతో తడ–సత్యవేడు రోడ్డు అభివృద్ధి

- కడూరు కూడలి నుంచి చిన్నపాండూరు వరకు బీటీ రోడ్డుగా మార్పు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో మంజూరైన నిధులు
- ప్రారంభమైన రోడ్డు పనులు


రోడ్డు పనులు చేపడుతున్న యంత్రాలు

వరదయ్యపాళెం: మండలంలోని తడ–సత్యవేడు రోడ్డు అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో రాష్ట్రప్రభుత్వం నాబార్డ్ ద్వారా రూ.4.50 కోట్లు నిధులను మంజూరు చేసింది. కడూరు కూడలి నుంచి చిన్నపాండూరు వరకు 8 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డుగా వేయనున్నారు. 12 ఏళ్ల కిందట డబుల్ రోడ్డుగా విస్తరణ అయిన ఈ రోడ్డు అభివృద్ధిపై గత టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో ఈ రోడ్డు మార్గంలోని వెంకటరెడ్డి కండ్రిగ, కంచరపాళెం, యానాదివెట్టు గ్రామాల వద్ద పెద్దఎత్తున రోడ్డు ధ్వంసమైంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వాహనదారుల పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. చిన్నపాటి కార్లు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే..

ఏడాది కిందట కడూరు కూడలి నుంచి చిన్నపాండూరు వరకు రోడ్డు తరచూ మరమ్మతులకు గురవ్వడం, వాహనదారుల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన ఎమ్మెల్యే ఆదిమూలం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధుల మంజూరు కోసం అంచనాలను సిద్ధం చేయించి రాష్ట్ర ముఖ్యమంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం రోడ్డు మరమ్మతుల జాబితాలో ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో రూ.4.5 కోట్లను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. గతవారం రోజుల నుంచి రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెలాఖరుకల్లా రోడ్డు పూర్తి చేసే దిశగా పనులు చేపడుతున్నట్లు శ్రీకాళహస్తి రోడ్డు భవనాల శాఖ సబ్‌డివిజన్ డీఈ శ్రీనివాసులు తెలిపారు.

పాపానాయుడుపేటలో అన్నదానం



ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సుబ్రమణ్య స్వామి ఆలయంలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో స్వామివారికి పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1000 మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఏడాది అన్నదానం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో మురుగప్ప, రాజా, అర్జునబాబు, దొరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వాసుదేవనాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు సోమవారం కలిశారు. తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన వాసుదేవ నాయుడు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువే ఆస్తి

సత్యవేడు: తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువే ఆస్తి అని సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మదనంబేడు పంచాయతీలోని అన్నే థెరిసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ శరణాలయంలో ఆయన పిల్లలకు ఉచితంగా దుప్పట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను స్వచ్ఛంద సంస్థ చదివించడం, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని నేటి సమాజంలో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తోందన్నారు. అంతకుముందు ఆయన నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అన్నేథెరిసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ అర్పుదరాజ్, ఎస్‌ఐలు శ్రీకాంత్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వార్డన్లు నిర్మల, సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.


మదనంబేడు అనాథ ఆశ్రమంలో పిల్లలకు దుప్పట్లు అందజేస్తున్న సీఐ శివకుమార్ రెడ్డి

పేదలకు దుస్తుల పంపిణీ

రేణిగుంట: మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో రేణిగుంట జెరూసలెం అపోస్తలిక్ చర్చిలో పేదలకు ఎంపీపీ చేతుల మీదుగా చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. తొలుత కేకును కత్తిరించి పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, సర్పంచ్ నగేషం, ఎంపీటీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత విమానాశ్రయ మార్గంలోని అక్షయ క్షేత్రంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: ఆంగ్ల సంవత్సరం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను పలు సంఘాల నాయకులు, ఏపీటీఎఫ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, టైలర్స్ అసోసియేషన్ నాయకులు, దేవస్థానం పారిశుధ్య కార్మికులు, ఏపీసీడ్స్ కార్మి సంస్థ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, అధికారులు, పట్టణ ప్రముఖులు ఆయన నివాసం వద్దకు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్మన్ ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తారక శ్రీనివాసులు

నూతన సంవత్సర వేడుకలు


బియ్యపు పవిత్రారెడ్డికి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పఠాన్ ఫరీద్


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలను నిర్వహించారు. మొదట ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి, పంచి పెట్టారు. అనంతరం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు, పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రావు పవార్, పఠాన్ ఫరీద్, గోరా, డీఎస్పీ భీమారావు, సీఐ అంజుయాదవ్, పోలీసు అధికారులు, ఆలయ అధికారులు, పలుశాఖల అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో సోమవారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో బియ్యపు పవిత్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో బియ్యపు పవిత్రారెడ్డి, గున్నేరి కిషోర్‌రెడ్డిని కలిసి శాలువలతో సన్మానించి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితులు


బియ్యపు పవిత్రారెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు


ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసిన పలువురు ప్రముఖులు


పవిత్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆమ్ ఆద్మీ పార్టీ విస్తృత ప్రచారం

వరదయ్యపాళెం: ఆమ్ ఆద్మీ పార్టీతోనే పేద ప్రజలకు నిజమైన అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి అన్నారు. పార్టీ చేపట్టిన సామాన్యుడి శంఖారావం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నియోజకవర్గ కన్వీనర్ మొరంపల్లి నందిని ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ విధివిధానాలను ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ సామాన్యున్ని శక్తిమంతులుగా మార్చాలన్న సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాసులు, పార్లమెంటు కో–ఆర్డినేటర్ నీరుగట్టు నగేష్, జిల్లా కోశాధికారి వెంకటేష్, మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులు రెడ్డి, యూత్ కన్వీనర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.


వరదయ్యపాళెంలో కరపత్రాలను అందజేస్తున్న ఆప్ పార్టీ నేతలు